


శంకారభరణం - ఆది

అలరులు గురియగ - నాడెనదే
అలకల కులుకుల - నలమేల్మంగ

అరవిరి సొబగుల - నతివలు మెచ్చగ
అర తెర మఱుగున - నాడెనదే
వరుసగ పూర్వదు - వాళపు దిరుపుల
హరి గరగింపుచు - నలమేల్మంగ

మట్టపు మలపుల - మట్టెల కెంపుల
తట్టెడి నడమల - దాటెనదే
పెట్టిన వజ్రపు - పెండెపు దళుకులు
అట్టిటు జిమ్ముచు - నలమేల్మంగ

చిందుల పాటల - సిరి పొలయాటల
అందెల మ్రోతల - నాడెనదే
కందువ తిరువేం - కటపతి మెచ్చగ
అందపు తిరుపుల - అలమేల్మంగ

అలమేల్మంగ దివ్య నృత్య సంకీర్తనమిది. అలమేల్మంగ ఆడిన నాట్య ముద్రల అభినయ భంగిమల ఆట అన్నమాచార్యుల రసపు పూటల మాటల పాటగా పరిణమించింది. ఈ సంకీర్తనాగానం జరిగే యింట అలమేల్మంగ - శ్రీమహాలక్ష్మి నిత్య నృత్యమాడుతుంది. అధర్వణ రహస్యంలోని లక్ష్మీహృదయ మంత్ర స్తోత్రాన్ని ఈ చిందు విందుల పదంలో అందంగా పొందుపరచారు ఆంధ్రవేదస్రష్ట.

తన ముంగురులు చెలరేగుతుండగా, నల్లత్రాచు వంటి జడ నర్తించగా, అందాలు కురిపిస్తూ అలమేల్మంగ నృత్యమాడింది. వికసించిన ఆమె సొబగులు, ఆ అలమేల్మంగ ఓసపరితనాలు - అరవిరియై కనరాగా, వనితలందరూ మెచ్చేరీతిని సగం తెరచాటున అలమేల్మంగ నృత్యమాడింది. అలమేల్మంగయే లక్ష్మి. వనితలందరూ మెచ్చేది సౌభాగ్యం. సౌభాగ్యం లక్ష్మీ స్వరూపం. అరతెర మఱుగున - తొయ్యలులు పయ్యెదల చాటున - బంగారు మంగళసూత్రం రూపై, నానుతాడై, మంగళసూత్రానికి కట్టిన తాళిబొట్టుగా ప్రసిద్ధిగాంచిన ముత్తైదువతనపు వైభవమై నృత్యమాడింది ఆ జగన్మాంగళ్య సౌభాగ్యలక్ష్మి. నాట్యశాస్త్ర క్రమానుసారంగా పూర్వదువాళపు తిరుపులతో - నాట్యారంభ వేళలో ఆచరించే - ప్లుతగతికి సమానమైన - రంగస్థలం అంతా త్రుటిలో చరించే వేగధాటిగల ఆంగికమైన అభినయ ప్రదర్శనలతో శ్రీహరి మనసు రసార్ద్రమౌ విధంగా ఆ లక్ష్మీ లావణ్యవతి లాస్యమాడింది.

అభినయవేళ అలమేల్మంగ పాదాలంకారాలైన కెంపుల మట్టెలు - ఆమె మట్టమైన భంగిమలో ఆత్మ ప్రదక్షిణంగా తిరిగినప్పుడు చిందులు వేసినప్పుడు వజ్రాల గండ పెండేరాల కాంతులతో ఒరసి నలుగడలా వెదజల్లబడి ఒనరుతున్నవి. నాట్యోపయుక్తమైన ధాతు మాతువుల గానంతో, తాళ లయబద్ధమైన అడుగుల నమరిన నర్తనా నైపుణ్యంతో, అందెలు ఘల్లు ఘల్లున మ్రోయగా అలరి, రసజ్ఞుడైన శ్రీ వేంకటేశ్వర రసహృదయం పరవశించగా, అందమంతా - జగత్సౌందర్య సర్వస్వం తామే అయిన నృత్య లీలా గతులతో అలమేల్మంగ నాట్యాభినయమాచరించింది. అన్నమయ్య పల్కిన పద కవితలతో అలమేల్మంగ నాట్యాభినయమాచరించింది. అన్నమయ్య పల్కిన పద కవితలలో అలమేల్మంగా నృత్యగానం సౌభాగ్య లక్ష్మీ సావాహన నర్తన మంత్రమై సాక్షాత్కరించింది.

ఈ మంత్రఫలం - ఈ సంకీర్తనా గానబలం చేత దీనిని చదివే, గానం చేసేవారికి సౌభాగ్యమూ, భాగ్యమూ కూడా అలమేల్మంగా శ్రీస్వాముల కృప వల్ల నిస్సందేహంగా సిద్ధిస్తాయి.